క్లుప్తంగా

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల స్వీకరణ

మరిపెడ: అర్హులైన వారు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని మరిపెడ మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి రూ.3లక్షలు ఇస్తుందన్నారు. గృహలక్ష్మి పథకానికి మహిళలు, వితంతువులు వారి పేరున గల స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కాగితాలతోపాటు కుల ధ్రువీకరణ, ఆధాయ ధ్రువీకరణ పత్రాలు, ఆహారభద్రత, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతాలతో ఈనెల 10లోపు మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని 19వార్డులో మంగళవారం మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

దంతాలపల్లి: మండలంలోని అర్హులైన వారినుండి గృహలక్ష్మి దరఖాస్తులను స్వీకరిస్తునట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రావు తెలిపారు.

గడువులోపు దరఖాస్తు చేసుకోవాలి

డోర్నకల్: ఖాళీ స్థలం ఉండి ఇళ్లు లేని పేదలంతా గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, కమిషనర్, మున్వర్‌బేగ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో బోనాలు



తొర్రూరు రూరల్: మండలంలోని చెర్లపాలెంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలంగాణ సాంస్కృతిక, సంప్రదాయాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు, విద్యార్థులంతా కలిసి బోనాల వేడుకలను మంగళవారం జరుపుకున్నారు.

తీజ్ వేడుకలు



పెద్దవంగర: తీజ్ పండగ గిరిజన సంస్కృతి, సంప్రదాయనికి నిదర్శనం అని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు, ఎన్నారై అనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రెడ్డికుంట తండాలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ సభ్యులు నిరంజన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేష్, సర్పంచ్ జగ్గానాయక్ పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ



డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సాంపంగి రమేష్, సురేష్ సోదరులు మల్యాల గ్రామానికి చెందిన 300 మంది వరద బాధితులకు రూ.4లక్షల విలవైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

పరామర్శ..

గూడూరు: చదువుకుంటూ 8 ఏళ్లుగా ప్రేమించిన దళిత వర్గానికి చెందిన హెచ్ ప్రభావతిని, బీసీ వర్గానికి చెందిన కస్నబోయిన కార్తీక్ పెళ్లి చేసుకోవాలని బీఎస్పీ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్యమాదిగ అన్నారు. గూడూరు ఎస్సీ కాలనీకి చెందిన హెచ్ ప్రభావతిని, ప్రియుడు, అతని కుటుంబ సభ్యులు కాదన్నారనే కారణంతో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెల్సుకున్న ఆయన ఆస్పత్రిలో ప్రభావతిని పరామర్శించాడు.

'గృహలక్ష్మి'కి కష్టాలు

- ధ్రువీకరణ పత్రాల కోసం పడిగాపులు
- ఇంటి స్థల రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తుదారుల ఇబ్బందులు

డోర్నకల్: గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకునేవారు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. నిబంధనలకు సంబంధించి స్పష్టత లేకపోవడం, దరఖాస్తులతో ఎలాంటి ధ్రువీకరణ పత్రాలను జత చేయాలనే అంశంపై దరఖాస్తుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. లబ్ధిదారు మహిళగా ఉండి 75 గజాల ఖాళీ స్థలం తన పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఉండాలనే నిబంధన ఉండటంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్‌కార్డు, తెల్లరేషన్ కార్డు, ఓటర్‌ఐడి, బ్యాంక్ ఖాతా, ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలు, ఫొటోలు సమకూర్చుకునేందుకు ఇబ్బందులు లేకున్నా స్థల రిజిస్ట్రేషన్ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేషన్ కార్డులోని కుటుంబ సభ్యుల్లో ఎవరి పేరున ఖాళీ స్థలం రిజిస్ట్రేషన్ ఉన్నా పరిగణలోకి తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పేదలను మోసగిస్తున్నారు: శీలం భాగ్యలక్ష్మి, కౌన్సిలర్

ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం కోసం ఎదురు చూస్తున్న పేదలను గృహలక్ష్మి పథకంతో మోసం చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో లబ్ధిపొందడం, సాధ్యం కాని నిబంధనలు, అధికార నాయకుల పెత్తనాలతో పేదలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు.

దరఖాస్తు గడువు పెంచాలి

నెహ్రూసెంటర్: గృహలక్ష్మి దరఖాస్తులు చేసుకునేందుకు గడువు పెంచాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి చంద్రన్న, సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి మంగళవారం అన్నారు. కేవలం మూడు రోజులే గడువు కేటాయించడం సరికాదన్నారు. 9 రకాల పత్రాలను జతచేసి దరఖాస్తులు అందజేయాలని చెప్పడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

అర్హులకు అందజేయాలి

మహబూబాబాద్ రూరల్: గృహలక్ష్మి పథకం పైరవీకారుల పాలిట కల్పవృక్షంగా మారిందని వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్య గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకం అధికార నాయకులు, ప్రజాప్రతినిధుల బంధువులకు, కుటుంబ సభ్యులకు పైరవీకారుల పాలిట కల్పవృక్షంగా మారిందని తెలిపారు. ఎమ్మెల్సీ స్పందించి అర్హులైన పేదలకు గృహలక్ష్మి పథకం అందేలా కృషి చేయాలన్నారు.



ధ్రువపత్రాల కోసం మీసేవ వద్ద పడిగాపులు కాస్తున్న దరఖాస్తుదారులు

రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ భూస్థాపితం

- బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు సురేందర్‌నాయక్

గార్ల: రాష్ట్రంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ భూస్థాపితం కావడం ఖాయమని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకులు బి.సురేందర్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం గార్ల వర్తక సంఘం భవనంలో జరిగిన పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంతోమంది యువకుల ఆత్మ బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో కొత్తకొత్త పథకాలతో ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంత, కుటుంబ పాలన సాగిస్తున్నారన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గెలిచి నాలుగేళ్లు దాటినా నేటికీ మండలంలో ప్రధాన సమస్య అయిన పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టక పోవడం ధారుణమన్నారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్ నియంత పాలన పోవాలంటే, ప్రజలు బీజేపీని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జశ్వంత్‌ప్రసాద్ ఠాకూర్, రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యదర్శి విమల్‌కుమార్ జైన్, మాధవ్, నాగరాజు, రాహుల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేందర్‌నాయక్

వ్యక్తిగత ఫొటోలు షేర్ చేయొద్దు



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సునంద

నెల్లికుదురు: గుడ్డిగా ఎవ్వరిని నమ్మవద్దని షీటీం ఎస్సై సునంద బాలికలకు సూచించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాలతో సీసీఎస్ సీఐ ఆధ్వర్యంలో బాలబాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై సునంద మాట్లాడుతూ.. బాలికలు ప్రయాణం చేస్తున్న సమయంలో ఎవ్వరిని గుడ్డిగా నమ్మవద్దన్నారు. వ్యక్తిగత విషయాలను , వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో గాని ఇతరులకు షేర్‌చేస్తే జరిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. బాధితులు షీటీం కార్యాలయానికి రాలేని పక్షంలో షీటీం సభ్యులే వారి వద్దకు వెళ్తారని అన్నారు. ఆపదలో షీటీం వాట్సాప్ నంబర్లు 87126 56935, 79011 42009 తెలపాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏఎస్సైలు ఆనందం, యాకయ్య, వెంకన్న పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలను విస్తృతం చేయాలి

మహబూబాబాద్: రోటరీ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని క్లబ్ 3150 జిల్లా గవర్నర్ రోటేరియన్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎస్ఎస్‌వీఎల్ ఫంక్షన్ హాల్‌లో రోటరీ క్లబ్ మానుకోట శాఖ 2023–24 నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా కె.నాగేందర్, కార్యదర్శిగా గూడూర్ నాగేశ్వర్‌రావు, కోశాధికారిగా వి.కిశోర్‌కుమార్ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో బోల్లం శ్రీనివాస్, కొండల్‌రావు, కోటేశ్వరరావు, వైద్యనాథన్, సురేందర్‌రెడ్డి, సదానందం, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న క్లబ్ ప్రతినిధులు

అటవీ చట్ట సవరణ నిలిపివేయాలి

కొత్తగూడ: అటవీ సంరక్షణ బిల్లు సవరణ నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఆదివాసీ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆదివాసీలు అటవీ సంపదపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అలాంటి అడవిని స్థానిక ఆదివాసీల ప్రమేయం లేకుండా బడా కంపెనీలకు ధారాదత్తం చేసి అటవీ సంపదను దోచుకుపోయే కుట్ర జరుగుతుందన్నారు. సదస్సులో మురళీ కృష్ణ, ఆరెల్లి కృష్ణ, నర్సక్క, పుల్లన్న, శ్రీశైలం, యుగేందర్, తదితరులు పాల్గొన్నారు.

నేర్చుకున్నది విద్యార్థులకు చెబుదాం..

నెల్లికుదురు: నేర్చుకున్నది విద్యార్థులకు నేర్పిద్దామని, పిల్లల సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులే మూలమని ఎంఈఓ గుగులోతు రాము ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలో వారం రోజులుగా నిర్వహించిన తొలిమెట్టు కార్యక్రమం మంగళవారం ముగింపు సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 184 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఆరుద్ర వెంకటేశ్వర్లు, డీఆర్పీలు రాకేష్ కుమార్, యాకేందర్, రాజ్‌కుమార్, మహేందర్, లింగమూర్తి, ఉదయ్‌కిరణ్ ఉపాధ్యాయులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుధాకర్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈఓ గుగులోతు రాము అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న రాగి జావ, బెల్లం ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు యుగేందర్‌రెడ్డి, శ్రీధర్, ఇంద్రసేనారెడ్డి, లక్ష్మన్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ రాము

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: మానసిక ఒత్తిడి, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లా యోగాసన ప్రధాన కార్యదర్శి రాము అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం రాష్ట్రస్థాయి యోగా ఎంపికలు నిర్వహించారు. సబ్ జూనియర్, సీనియర్ విభాగంలో మొత్తం 18మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పుష్పలీల, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, పీఈటీల అసోసియేషన్ సెక్రటరీ చాంప్లా నాయక్, అథ్లెటిక్ సెక్రటరీ పద్మావతి, జాయింట్ సెక్రెటరీ రాజకుమార్, వైస్ ప్రెసిడెంట్ రవి పాల్గొన్నారు.

వీరారంలో కేంద్ర బృందం పర్యటన

మరిపెడ రూరల్: మండలంలోని వీరారం గ్రామ పంచాయతీలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ (ఎస్ఎస్‌జీ) కేంద్ర బృందం సభ్యులు మంగళవారం పర్యటించారు. గ్రామ పంచాయతీలో స్థానిక అధికారులతో ప్రతీ ఇంటికి వెళ్లి వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, చెత్తసేకరణ పరిశీలించారు. గ్రామ పారిశుద్ధ్య పనులపై సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుగులోతు అరుణ, ఎంపీడీఓ కేలోతు ధన్‌సింగ్, సర్పంచ్ అజ్మీర పద్మ హరినాయక్, ఎంపీటీసీ జిక్కి నారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు మునేష్, ఎంపీఓ రామకృష్ణ, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



బృందం సభ్యులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

విద్యార్థినికి అభినందన

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని దారావత్ గీత జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు 100 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం, 400 మీటర్ల విభాగంలో ప్రథమ స్థానం సాధించింది. తద్వారా ఈనెల 7వ తేదీ సోమవారం వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గీత పాల్గొంది. ఈసందర్భంగా మంగళవారం ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, పీఈటీ శ్రీనివాసు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, శ్రీధర్ రెడ్డి, వెంకట్రామనర్సయ్య, గురునాథరావు, నరేష్ కుమార్, ఉప్పలయ్య, సతీష్ కుమార్, సోమేశ్వర్ పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సెకండ్ ఏఎన్‌ఎంల పోస్టుకార్డు ఉద్యమం

గార్ల: సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గార్లలో సెకండ్ ఏఎన్‌ఎంలు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. తమను రెగ్యూలర్ చేయాలని కోరుతూ వారు పోస్టాఫీస్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌కు ఉత్తరాలు రాసి పోస్టుచేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్‌ఎంలు పార్వతి, సునీత, జయ, శాంతాబాయి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

మరిపెడ రూరల్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని తాళ్లఊకల్ ఎంపీటీసీ కొంపెల్లి సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చింతలగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు పాకనాయక్, కార్యదర్శి అనురాధ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో సర్పంచ్



డోర్నకల్: మండలంలోని అందనాలపాడు సర్పంచ్ ఆంగోత్ మోహన్ మంగళవారం పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండగా పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపాడు.

సంక్షిప్త సమాచారం

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

గార్ల: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు గడించవచ్చని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు రామారావు, అరుణ్ రైతులకు సూచించారు. మండలంలోని చిన్నకిష్టాపురం గ్రామంలో ఆయిల్‌పామ్ తోటలో క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు అవగాహన కల్పించారు. క్షేత్ర ప్రదర్శనలో ఏఈఓ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

తొర్రూరు: ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల నూతన కమిటీని మంగళవారం డివిజన్ కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మేరుగు కర్ణాకర్, కార్యదర్శిగా కాసర్ల రవి కుమార్, కోశాధికారిగా పస్తం సాయికిరణ్‌లు ఎన్నికయ్యారు.

పాలాభిషేకం

తొర్రూరు: మంత్రి కేటీఆర్ గతంలో ఇచ్చిన హామీ మేరకు తొర్రూరు మున్సిపాలిటీకి రూ.25కోట్లు కేటాయించడాన్ని హర్షిస్తూ మంగళవారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ ఎదుట సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, దయాకర్‌రావుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ పానుగోటి సోమేశ్వర్ రావు, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చిరువ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

మహబూబాబాద్: ఢిల్లీలో ఆర్‌పీఎస్ డీజీపీ మనోజ్ యాదవ్‌ను ఎంపీ మాలోత్ కవిత మంగళవారం కలిశారు. రైల్వే స్టేషన్‌లను ఆధారంగా చేసుకుని వాటి పరిసరాలలో, వ్యాపారం చేసుకుంటూ జీవించే పేద ప్రజలను రైల్వే పోలీసులు ఇబ్బంది పెడుతున్నట్లు వినతిపత్రం ఇచ్చారు.

ఉపాధ్యాయుల నిరసన

దంతాలపల్లి: మండల కేంద్రంలో గల జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం నాన్ స్పౌజ్ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలలో ప్రభుత్వం స్పౌజ్‌లకు కేటాయిస్తున్న 10 పాయింట్ల వలన నాన్ స్పౌజ్ ఉపాధ్యాయులు అధిక నష్టం చేకురుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, యాకుబ్‌అలీ, సురేందర్‌గుప్తా, రాములు, హర్షవర్ధన్‌రెడ్డి, సురేష్, మంజులా పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ప్రేమ్‌కుమార్



కేసముద్రం: కేసముద్రం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా బెజ్జం ప్రేమ్‌కుమార్‌ను నియమించినట్లు పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ టి.లక్ష్మీనర్సింహరావు మంగళవారం తెలిపారు. కమిటీ కార్యదర్శిగా పరాంకుశం శ్రీహరి, కోశాధికారి శామకూరి నర్సయ్యలను నియమించినట్లు పేర్కొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

మరిపెడ: మండల జర్నలిస్టులు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐజేయూ సంఘం సభ్యులు జిన్న లచ్చయ్య, గందసిరి రవి, మహమ్మద్ రియాజ్‌పాష, తిరుమలరావు, చంద్రశేఖర్, అక్తర్‌పాష, మచ్చ రాజేష్, తిరుపతి, బోడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘీభావం

గార్ల: జీపీ కార్మికుల సమ్మె శిబిరాన్ని మంగళవారం ఎపంచాయతీ కార్యదర్శులు సందర్శించి సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. కార్యదర్శులు కిషన్, రామకృష్ణ, అఖిలాష్, వెంకటేష్, నరసింహ, కిరణ్, అనిల్, సురేందర్, రాజేందర్, క్రాంతి ఉన్నారు.

రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా రాజుయాదవ్



గార్ల: జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా గార్లవాసి సూత్రపు రాజుయాదవ్‌ను నియమిస్తూ మంగళవారం హైదరాబాద్‌లో సంఘం జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ నియామకపత్రం అందజేశాడు.

ఫర్టిలైజర్ షాపు తనిఖీ

నర్సింహులపేట: మండల కేంద్రంలోని లక్ష్మీ సాయి ఫర్టిలైజర్‌ను మంగళవారం మరిపెడ ఏడీఏ శోభన్‌బాబు తనిఖీ చేశారు. కాలం చెల్లిన పురుగు మందులు విక్రయం చేశారనే ఘటనలో నిందితుడిగా ఉన్న ఏలేందర్ షాపును అధికారులు తనిఖీ చేశారు. స్టాక్ బోర్డుపై వివరాలు లేని కారణంగా ఐదు రోజులపాటు షాపులో సేల్స్ బంద్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ జావీద్, ఏఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.

నాయకుల కాగడాల ప్రదర్శన



మహబూబాబాద్ రూరల్: ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు గిరిజన సంరక్షణ హస్తం పేరిట కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గుగులోత్ వెంకట్ నాయక్, బోడ రవినాయక్, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, ముల్లంగి ప్రతాప్ రెడ్డి, తేజావత్ శంకర్ నాయక్, ధరావత్ నారాయణనాయక్, కొత్త యుగంధర్ పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

తొర్రూరు: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ కుప్పాల గణేష్ అన్నారు. వెలికట్ట వాసి, ఎన్నారై ఆబోతు మధు సౌజన్యంతో లండన్‌కు చెందిన మోటివేషనల్ స్పీకర్ గణేష్ మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నితిన్ ఫౌండేషన్, మండలంలోని గుర్తూరు మోడల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఎంఎఫ్ డైరెక్టర్ తక్కెళ్లపల్లి రవీంద్ర, హెచ్‌ఎం బీవీరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు ఆవుదూడల పంపిణీ

తొర్రూరు రూరల్: మండలంలోని జీకే తండాలోని పేద రైతులకు లేగదూడలను తెలంగాణ గోశాల వారి ఆధ్వర్యంలో ఉచితంగా మంగళవారం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ గోశాల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ మాట్లాడుతూ.. ప్రతి రైతు పాడిగేదెలు, లేడదూడలను ఎంతో ప్రేమగా కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోతు అచ్చమ్మసోమ్లా నాయక్, నిర్వాహకులు పాల్గొన్నారు..

క్రైం కార్నర్..

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


మహబూబాబాద్ రూరల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మహబూబాద్ మండలంలోని సికింద్రాబాద్ తండా జీపీ పరిధిలోని నక్కబండ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై బి.రాంచరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ తండ జీపీ పరిధిలోని నక్కబండ గ్రామానికి చెందిన డప్పు రవీందర్ (28) మద్యానికి బానిసై పని చేయకుండా తిరుగుతున్నాడు. దీంతో అతడి భార్య సుజాత ఖాళీగా తిరుగుతున్నావు, వ్యవసాయం పనులు చేసుకుందామని అన్నది. దీంతో ఇరువురు ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో ఈనెల 6న ఇంట్లో ఎవరు లేని సమయంలో మధ్యాహ్నం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వరంగల్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తల్లి మరణం తట్టుకో లేక కొడుకు..

గార్ల: తల్లి మరణం జీర్ణించుకోలేక ఐదు రోజుల వ్యవధి లోనే కొడుకు మృతిచెందిన సంఘటన మంగళవారం గార్లలో చోటుచేసుకుంది. వివరాలిలావున్నాయి. గార్లకు చెందిన గంజి సీతమ్మ(88) ఈనెల 3వ తేదీన మృతి చెందింది. తల్లి దశదిన కర్మలు కాకముందే, ఐదో రోజు కొడుకు గంజి శ్రీనివాసరావు(61) తల్లి మృతి చెందిదనే మనోవేదనకు గురై మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం.

బైక్ ఢీకొనడంతో ఒకరు..

కేసముద్రం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని మహముద్‌పట్నం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ శివారు శాంతినగర్ కాలనీ చెందిన గుడ్ల శ్రావణ్‌కుమార్(35), కేసముద్రం మండలం మహముద్‌పట్నం గ్రామానికి చెందిన తన మామ సామల శ్రీనివాస్ ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో ఇంట్లో భోజనం చేసిన అనంతరం శ్రావణ్‌కుమార్ తన బావమరిదితో కలిసి, రాత్రి ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా, ఇనుగుర్తి మండలం తారాసింగ్ తండాకు చెందిన బానోతు ప్రవీణ్ అనే వ్యక్తి బైక్ శ్రావణ్‌కుమార్‌ను ఢీ కొట్టడంతో అతనికి కాళ్లు, చేతులకు, తలకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన అతన్ని మానుకోట ఆసుపత్రికి, అక్కడి నుండి వరంగల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రావణ్‌కుమార్ మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సమత, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



మృతుడు శ్రావణ్‌కుమార్

ఉద్యోగాలిప్పిస్తామని మోసం.. ఇద్దరిపై కేసు నమోదు

కురవి: ఉద్యోగాలిప్పిస్తామని మోసం చేసిన ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.గోపి మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండలంలోని మొగిలిచర్ల గ్రామానికి చెందిన ఇరుకలపాటి నాగేశ్వర్‌రావు, మహబూబాబాద్‌కు చెందిన కె.సంజీవరెడ్డిలు 2018లో విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొత్తూరు(జీ) గ్రామానికి చెందిన భట్టు ఉప్పలయ్య, మానుకోటకు చెందిన ఎండీ గౌస్ పాషా వద్ద రూ.13లక్షలు తీసుకున్నట్లు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగాలు ఇవ్వక పోగా డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. భట్టు ఉప్పలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగేశ్వర్‌రావు, సంజీవరెడ్డిలపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపి వివరించారు.

విద్యుత్ స్తంభం పైనుంచి పడి కార్మికుడికి తీవ్ర గాయాలు

డోర్నకల్: మండలంలోని చిలుకోడు గ్రామంలో విద్యుత్ స్తంభంపై పని చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలు.. కురవి మండలం బలపాల గ్రామానికి చెందిన బత్తుల వెంకటేశ్వర్లు మహబూబాబాద్‌కు చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. చిలుకోడు గ్రామంలో మంగళవారం విద్యుత్ స్థంభాలపై విద్యుత్ వైర్లు అమర్చేందుకు వెంకటేశ్వర్లు విద్యుత్ స్తంభం ఎక్కాడు. ప్రమాదవశాత్తు కింద పడడంతో గాయలపాలయ్యాడు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి



దంతాలపల్లి: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 12న మానుకోట జిల్లా కేంద్రంలో తలపెట్టిన ర్యాలీలు, ధర్నాను విజయవంతం చేయాలని యూఎస్‌పీసీ జిల్లా నాయకుడు పులిచింతల విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. మండలకేంద్రంలో గల జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, తుళ్లూరి రవీందర్, సురేందర్ గుప్తా, కుమారస్వామి, రవీందర్, ఎస్‌కె పాషా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.